క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



పార్టీ నాయకులతో ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గం 27వ డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జిగా అల్లంపాటి శ్రీధర్‌రెడ్డిని విజయకుమార్‌రెడ్డి నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ శ్యామ్‌సింగ్, రూరల్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు సతీష్, పార్టీ నేతలు మస్తాన్‌రెడ్డి, రమణారెడ్డి, రమేష్, సురేందర్‌రెడ్డి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్ఎస్ కలెక్టరేట్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న నాగేశ్వరరావు

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) కలెక్టరేట్ యూనిట్‌కు, కందుకూరు డివిజన్ యూనిట్‌కు శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఉన్న సంఘ కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. కలెక్టరేట్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా యడ్ల నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా కేసీహెచ్‌వీ అనిల్‌కుమార్ యాదవ్, పి.అశోక్‌వర్ధన్ వ్యవహరించారు. కాగా కందుకూరు డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా గుడ్లూరు మండల తహసీల్దార్ ఎస్.వి జయభాస్కర్‌ను, జనరల్ సెక్రటరీగా కందుకూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంఎల్ఎన్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వలేటివారిపాళెం డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్‌రావు, ఉపాధ్యక్షులుగా కె.లక్ష్మీప్రసన్న (డిప్యూటీ తహసీల్దార్), భార్గవి (రీసర్వే డీటీ), అంజయ్య (సీనియర్ అసిస్టెంట్), జాయింట్ సెక్రటరీలుగా శ్రీదేవి (ఆర్ఐ), శ్రీకాంత్ (ఆఫీస్ సబార్డినేట్), హనుమాయమ్మ (రీసర్వే డీటీ), కోశాధికారిగా ఎం.రమణయ్య (సీనియర్ అసిస్టెంట్)తోపాటు మరో ముగ్గురు ఈసీ మెంబర్లుగా, ఇద్దరు జిల్లా కౌన్సిలర్లుగా నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా కావలి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ వ్యవహరించారు. నూతన కమిటీని పలువురు ఉద్యోగులు అభినందించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, డానియేల్ పీటర్ మాట్లాడుతూ ఈ ఎన్నికల రెవెన్యూ ఉద్యోగుల ఐక్యతకు మారుపేరుగా నిలిచాయన్నారు.

యుద్ధాలతో ప్రాణ, ఆస్తి నష్టం

- జేవీవీ ఆధ్వర్యంలో హిరోషిమా, నాగసాకి డే



శాంతి కపోతాలను ఎగురవేస్తున్న శ్రీనివాసులు తదితరులు

నెల్లూరు(అర్బన్): 'యుద్ధాల వల్ల దేశాలు ఆర్థికంగా చితికిపోతాయి. రెండు వైపులా ప్రాణ, ఆస్తి నష్టం ఉంటుంది. ఎంతోమంది అభాగ్యులుగా మారుతారు. అందువల్ల ప్రతి ఒక్కరూ యుద్ధాలను వ్యతిరేకించి శాంతిని కోరుకోవాలి' అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు అన్నారు. శనివారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద హిరోషిమా, నాగసాకి డేను నిర్వహించారు. ముందుగా జేవీవీ నాయకులు శాంతి కపోతాలను ఎగురవేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలకోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, ఏఎస్‌డబ్ల్యూఓ హజరత్తయ్య, జేవీవీ నాయకులు డాక్టర్ వేణుగోపాల్, శివపార్వతి, దశరథరామయ్య, చైతన్య ప్రసాద్, శేషు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుచ్చి పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరు హరిజనవాడకు చెందిన ఎల్.రమేష్ (45) స్థానికంగా జ్యూస్ దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో భాగంగా అప్పుల పాలవడంతో కనిగిరి రిజర్వాయర్ వద్ద కొండల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంతోష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అస్తవ్యస్తంగా శివాజీ నగర్



నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా వీరికి కంటి మీద కునుకు లేని పరిస్థితి నెలకొంటోంది. రోజుల తరబడి వర్షపు నీరు నిల్వ చేరిపోతోంది. అంతే కాకుండా పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీటిలో చెత్తా చెదారాలు కలిసి ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. పొదలకూరు రోడ్డులోని శివాజీ నగర్‌లో దళితులు నివాసం ఉండే ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో కొద్దిపాటి వానకు సైతం కాలనీ మొత్తం నీటితో మునిగిపోతోంది. దీనివల్ల ప్రజలు అనేక రోగాలతో అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో పాములు, విష కీటకాలు ఇంట్లోకి వస్తుండడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వర్షపునీరు, డ్రెయినేజీ కలిసిపోవడంతో దారి లేక విద్యుత్ స్తంభం మీదుగా ప్రమాదకరంగా వెళ్తున్న చిన్నారులు, మహిళ



రోజుల తరబడి రోడ్డుపై నిలిచిన నీరు



నివాసాల మధ్య డ్రెయినేజీ నీటిలో చెత్త కలిసి అధ్వానంగా మారిన వైనం

శ్రావణం.. శుభకరం



రాజరాజేశ్వరికి అభిషేకం గావిస్తున్న అర్చకుడు



రాజరాజేశ్వరి దేవస్థానంలో..



వెంకటేశ్వరస్వామికి కల్యాణం



మహాలక్ష్మి దేవస్థానంలో చండీయాగం



చండీహోమం జరిపిస్తున్న అర్చకులు

నెల్లూరు(బారకాసు): శ్రావణ పౌర్ణమి సందర్భంగా నగరంలోని వివిధ ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

- రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేశారు. తొలుత అమ్మవారికి విశేష పుష్పాలంకారణ చేసి లలితా సహస్రనామం, ఖడ్గమాల తదితర పూజలు నిర్వహించారు. చిట్టిబోయిన రాజా, దివ్య, జోషిక, జైదేవ్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈఓ కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.
- స్థానిక మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదాతలుగా సముద్రల మురళీకృష్ణ దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
- బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో వెంకటేశ్వరస్వామికి శనివారం కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా సాగింది. తొలుత స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. ఉభయకర్తలుగా తన్నీరు భగవాన్–ప్రసున వ్యవహరించారు. దేవస్థాన కమిటీ సభ్యులు అమరా మోహన్‌రావు, తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం, శివప్రసాద్, హనుమంతరావు పాల్గొన్నారు.
- కోదండరామపురంలోని మహాలక్ష్మి దేవస్థానంలో వార్షిక కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాటేపల్లి వెంకటరమణయ్య–సరిత దంపతులు చండీయాగం జరిపించారు. తొలుత కలశస్థాపన, మండపారాధన, అగ్నిప్రతిష్ట, గణపతిహోమం, అభిషేకం గావించారు. సాయంత్రం విశేష హోమాలు, మహాలక్ష్మి యాగం చేశారు. దేవస్థానం చైర్మన్ నరసింహం పర్యవేక్షించారు.
- సంతపేటలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్వాహకులు అరవపల్లి సుబ్బారావు దంపతులు తదితరులు పాల్గొన్నారు.

గోవర్ధనన్న వచ్చిన రోజే రక్షాబంధన్



మాట్లాడుతున్న సర్వేపల్లి ప్రజాప్రతినిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అక్రమ కేసులతో జైలులో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్న బయటకు వచ్చిన రోజే మాకు నిజమైన రక్షాబంధన్ అని వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి మహిళా విభాగం నాయకులు అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పొదలకూరు జెడ్పీటీసీ సభ్యురాలు నిర్మలమ్మ మాట్లాడుతూ ఇంటికే పరిమితమైన మాలాంటి మహిళల రాజకీయ ఎదుగుదల గోవర్ధనన్న ప్రోత్సాహమేనన్నారు. అందరి ఆశీర్వాదంతో అక్రమ కేసుల నుంచి బయటకు రావాలని ఆకాంక్షించారు. తోటపల్లిగూడూరు జెడ్పీటీసీ సభ్యురాలు శేషమ్మ మాట్లాడుతూ 2014 నుంచి సామాన్య కార్యకర్త స్థాయి నుంచి జెడ్పీటీసీ వరకు ఎదిగేందుకు గోవర్ధన్‌రెడ్డి ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ముత్తుకూరు ఎంపీపీ సుగుణమ్మ మాట్లాడుతూ రాఖీ పండగ అంటే మాకు గోవర్ధనన్న ఇచ్చే ధైర్యమే గుర్తుకు వస్తుందన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి నేడు జైలులో ఉండడం దురదృష్టకరమని, కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారన్నారు. పొదలకూరు ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, మనుబోలు ఎంపీటీసీ రాజేశ్వరి, మామిడిపూడి సర్పంచ్ మస్తానమ్మలు మాట్లాడుతూ అన్న అనే బంధానికి నిలువెత్తు రూపం మా గోవర్ధనన్న అని, సర్వేపల్లి ఆడపడుచులు ఆయనకు అండగా ఉంటారన్నారు. సర్వేపల్లి మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి మాట్లాడుతూ గోవర్ధనన్న త్వరలోనే బయటకు వచ్చి, మరింత ఉత్సాహంతో ప్రజా పోరాటాలు చేస్తారన్నారు.

పేద పిల్లలకు విద్యే ఆస్తి

నెల్లూరు (టౌన్): నేటి సమాజంలో పేద పిల్లలకు విద్యే ఆస్తి అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆయన వీఆర్సీ, ఆర్ఎస్సార్ పాఠశాలలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ మూలాపేట బాలికోన్నత పాఠశాల, డీఎస్సార్, ఆర్ఎస్సార్ స్కూల్‌ను వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధునికీకరిస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ పరిధిలోని 11 హైస్కూల్స్‌ను వచ్చే విద్యా సంవత్సరానికి సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, డీఈఓ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బీవీనగర్‌లోని గిరిజన భవన్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం గతేడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను సన్మానించారు. అలాగే ఆదర్శ గిరిజన రైతులు, ప్రజా ఉద్యమకారులను సత్కరించారు. మేయర్ స్రవంతి, గిరిజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థినిని సత్కరిస్తున్న మేయర్ స్రవంతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వనంతోపు, మినీబైపాస్ రోడ్డు, పెద్దబావిసెంటర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.. ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆటోనగర్ ఫేస్–1, 2, 3, శంకరన్ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత



నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పథకానికి సంబంధించి దుత్తలూరు మండల కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న రఫీ గుండెపోటుతో మరణించాడు. ఈ క్రమంలో ఆయన అంత్యక్రియలకు డ్వామా కార్యాలయం తరఫున రూ.15 వేలు, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ వారు రూ.20 వేలు అందించారు. ఈ సాయాన్ని రఫీ తల్లిదండ్రులకు వారి నివాసంలో శనివారం అందజేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ మృదుల, ఏపీడీ శంకర్‌నారాయణ, జేఏసీ నాయకులు కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థుల ప్రతిభ

పొదలకూరు: మండలంలోని అంకుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపారు. శనివారం నెల్లూరు ఏసీ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ పోటీల్లో ఏడుగురు విద్యార్థులు జిల్లా స్థాయికి, 8 వతరగతి చదువుతున్న యశ్వంత్, విఘ్నేష్, పెంచలయ్య రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం

- డాక్టర్ ఖాదర్‌వలీ



తనిఖీ నిర్వహిస్తున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. నగరంలోని గని డెంటల్ కేర్ ఆస్పత్రి, హెచ్‌ఆర్ స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి, సాయిరామ్ మెటర్నిటీ అండ్ కిడ్నీ సెంటర్, అనిల్ డయాబెటిక్ సెంటర్, డాక్టర్ ఆదినారాయణరెడ్డి ఈఎన్‌టీ ఆస్పత్రి, ఉమామహేష్ న్యూరో సెంటర్లను శనివారం తనిఖీ చేశారు. ఆయా ల్యాబొరేటరీలు, ఫార్మసీలను పరిశీలించారు. ఫైర్‌సేఫ్టీ మెజర్స్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్‌లను తనిఖీ చేశారు. అనంతరం డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడుతూ ఆస్పత్రుల యాజమాన్యాలు రోగులకు సంబంధించి కనీస సౌకర్యాలు కల్పించాలని, రికార్డులు పక్కాగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్, ప్రైవేటు మిక్స్ కో–ఆర్డినేటర్ హరీష్, భవ్య జిల్లా కో–ఆర్డినేటర్ తులసీరామ్, టీబీ కో–ఆర్డినేటర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం



చిన్నారులకు పోషకాహార ప్యాకెట్ల అందజేత

నెల్లూరు(బారకాసు): చిన్నారుల ఆరోగ్యమే తమ లక్ష్యమని 'ఆబైండింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్ అన్నారు. స్థానిక కొండాయపాళెం ట్రస్ట్ కార్యాలయంలో పోషకాహార ప్యాకెట్లను శనివారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల తాను కెన్యాలో పర్యటించానని, అక్కడ పిల్లల పరిస్థితి చాలా దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మందులు, న్యూట్రిషన్ ఫుడ్ తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జయప్రకాష్, సిస్టర్ మ్యాగీ, క్రాంతికుమార్, శశి, సునంద, జయ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



స్పాస్టిక్ సెంటర్‌లో..



ఎస్పీకి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



ఆనం విజయకుమార్‌రెడ్డితో మహిళా నేతలు

నెల్లూరు(అర్బన్): నగరంలోని మద్రాసు బస్టాండ్ పక్కన ఉన్న ఇండియన్ రెడ్‌క్రాస్ స్పాస్టిక్ సెంటర్ (మానసిక దివ్యాంగుల కేంద్రం)లో రక్షాబంధన్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్ రాజేంద్రప్రసాద్ పలువురు విద్యార్థులతో రాఖీ కట్టించారు. అనంతరం పిల్లలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగేంద్ర, ఏడుకొండలు, అఖిల్, స్పాస్టిక్ సెంటర్ ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

- నెల్లూరు(క్రైమ్): బ్రహ్మకుమారి ఈశ్వర విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు ఆయన కార్యాలయంలో శనివారం రాఖీ కట్టారు. అనంతరం బ్రహ్మకుమారీ పోస్టర్స్‌ను అందజేశారు. బ్రహ్మకుమారి ప్రసన్న, స్రవంతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
- నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డికి ఆయన నివాసంలో పార్టీ మహిళా నాయకులు శనివారం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ రాష్ట్ర అంగన్‌వాడీ విభాగం కార్యదర్శి వెంకట్ జ్యోతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీసునంద, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు లావణ్య, రూరల్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, మహిళా నేతలు మైథిలి, భారతి, హైమ పాల్గొన్నారు.

పూజితకు పలువురి అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితారెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం పలువురు నేతలు సత్కరించారు. జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి స్వర్ణ వెంకయ్య, ప్రజాసత్తా జాతీయ అధ్యక్షుడు పులగర శోభన్ బాబుతో పాటు పలువురు కలిసి అభినందనలు తెలిపారు.



పూజితను సత్కరిస్తున్న స్వర్ణ వెంకయ్య

ఇళ్ల పట్టాల పంపిణీ

నెల్లూరు సిటీ: నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్ కాలనీలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. సీఎం చంద్రబాబు వర్చువల్‌గా దీనిని ప్రారంభించి, మాట్లాడారు. భగత్‌సింగ్ కాలనీలో ఇంటి పట్టాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ 1,430 మందికి పట్టాలివ్వాల్సి ఉండగా తొలి విడతలో 633 మందికి ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్, మున్సిపల్ కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలను అందజేస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి